# విదేశీ వర్సిటీల బిల్లు.. ప్రభావం

**కేంద్ర మంత్రి వర్గం మార్చి 15న విదేశీ విద్యాసంస్థల (రెగ్యులేషన్ ఆఫ్ ఎంట్రీ అండ్ ఆపరేషన్స్- ప్రవేశం, కార్యకలాపాల నియంత్రణ) బిల్లు-2010ని ఆమోదించింది. దేశంలోకి విదేశీ విశ్వవిద్యాలయాలకు అనుమతినిచ్చేందుకు ఉద్దేశించిన ఈ బిల్లుపై మిశ్రమ స్పందనలు వస్తున్నాయి. కేంద్ర మానవవనరుల శాఖ మంత్రి కపిల్ సిబల్ ఎట్టి పరిస్థితుల్లోనైనా బిల్లుకు ఆమోద ముద్ర వేయించాలని కృతనిశ్చయంతో ఉన్నారు. కాగా రాజకీయపార్టీలు బిల్లుపై భిన్న స్పందనలు వ్యక్తం చేస్తున్నాయి. విద్యావేత్తలు బిల్లును స్వాగతిస్తూనే పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత్‌లోకి విదేశీ వర్సిటీల ప్రవేశంపై ఒక పరిశీలన..**

వాస్తవానికి విదేశీ విశ్వవిద్యాలయాలకు ప్రవేశం కల్పించాలనే ఆలోచన ఈనాటిది కాదు. 1995లో ఆవిర్భవించిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) విభాగాల్లో సేవల వాణిజ్య కౌన్సిల్ (council for trade in services) ఈ ప్రతిపాదన చేసింది.

## పిట్రోడా ప్రతిపాదన:

శామ్‌పిట్రోడా అధ్యక్షతన ఏర్పాటుచేసిన నేషనల్ నాలెడ్జ్ కమిషన్ తొలిసారిగా దేశంలోకి విదేశీ విశ్వవిద్యాలయాలను అనుమతించాలని సూచించింది. ఆ తర్వాత యశ్‌పాల్ కమిటీ కూడా ఇదే విధమైన ప్రతిపాదన చేసింది. ఇందుకోసం కొన్ని విధివిధానాలను సూచించింది. ప్రపంచ వాణిజ్య సంస్థ– 2005 హాంకాంగ్ సమావేశం తర్వాత భారత ప్రభుత్వం విదేశీ విశ్వవిద్యాలయాలను అనుమతించడానికి సానుకూలత వ్యక్తంచేసింది. ఈ దిశగా 2007లో కేంద్రమంత్రివర్గం బిల్లును ఆమోదించినప్పటికీ.. పార్లమెంటులో ప్రవేశపెట్టలేదు. ఈ బిల్లు ప్రకారం విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేయాలనుకునేవారు ముందుగా యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్)కి దరఖాస్తు చేసుకోవాలి. విద్యారంగంలో కనీసం ఇరవై ఏళ్ల అనుభవం ఉండాలి. రూ.50 కోట్ల కార్పస్ ఫండ్ డిపాజిట్ చేయాలి. కోర్సుల నిర్వహణకు అవసరమైన ఆర్థిక, ఆర్థికేతర వనరులు కలిగి ఉండాలి.

## విద్యలో గుణాత్మక మార్పు:

దేశంలోకి విదేశీవర్సిటీలను ఆహ్వానించడం వల్ల రెండు ప్రయోజనాలున్నట్లు కపిల్ సిబల్ పేర్కొన్నారు. ఒకటి.. అత్యున్నత ప్రమాణాలతో కూడిన శాస్త్ర, సాంకేతిక విద్యను యువతరానికి అందించగలగడం. రెండు.. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే వారు కోట్ల రూపాయలను డాలర్ల రూపంలో చెల్లిస్తున్నారు. దీనివల్ల దేశంపై పడుతున్న ఆర్థిక భారాన్ని నిరోధించవచ్చు. సమర్థంగా అమలు చేస్తే సిబల్ చెప్పినట్లు దేశ ఉన్నత విద్యారంగానికి ఎంతో మేలు జరుగుతుంది. ఎందుకంటే.. భారతీయ విద్యార్థులు దేశంలోనే ఉండి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను పొందవచ్చు. విదేశీ క్యాంపస్‌ల్లో చేసే ఖర్చు కంటే

SAKSHI

చాలా తక్కువ మొత్తంతోనే చదువుకోవచ్చు. ఏటా 1.6లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యకోసం అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా తదితర దేశాలకు వెళుతున్నారు. ఇందుకు ఏటా రూ. 35 వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఖర్చవుతోంది. విదేశీ విశ్వవిద్యాలయాలను అనుమతిస్తే.. ఈ ఖర్చును చాలావరకు తగ్గించుకోవచ్చు. అదే సమయంలో విదేశీ క్యాంపస్‌లు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజి లాండ్, సింగపూర్ వంటి దేశాలతో పోటీపడి భారత్‌ను పెద్ద విద్యా ఎగుమతిదారుగా ఆవిర్భవించేలా చేయగలవు. ఈ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కూడా గణనీయ సంఖ్యలో రాగలవని పరిశీలకులు భావిస్తున్నారు. దేశ ఆర్థిక ఉన్నతి (ప్రపంచంలో ఐదో స్థానం), వృద్ధిరేటు, భవిష్యత్తుకు సంబంధించిన అంచనాలు, పేద-ధనిక దేశాలకు వారధిగా నిలుస్తున్న భౌగోళిక పరిస్థితి, ఉన్నత ప్రమాణాలుగల అధ్యాపకులు, ఆంగ్లభాషకున్న ప్రాధాన్యం తదితరాలన్నీ ప్రపంచ విద్యాకేంద్రంగా భారత్ ఎదగడానికి కావలసిన అర్హతను అందిస్తున్నాయి. యూరోపియన్ యూనియన్, తూర్పు ఆసియా దేశాలలోని బహుళ జాతి సంస్థలు భారతీయ మార్కెట్, సామాజిక, ప్రాంతీయ వైరుధ్యాలు, వినిమయ ధోరణి, ప్రాంతీయ భాషలు తదితర అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి ఎందరో విద్యార్థులను భారత్‌కు ట్రైనీలుగా పంపే అవకాశం ఉంది.

### ఆరోగ్యకర పోటీ:

విదేశీ వర్సిటీల ప్రవేశంతో విద్యారంగంలో ఆరోగ్యకర పోటీ నెలకొంటుంది. ప్రస్తుతం దేశంలో ఐఐటీ, ఐబీఎం, ఐఐఎం, ఐఐఎస్, ఐఐఎస్ఆర్, సీసీఎంబీ వంటి 40 విద్యా సంస్థలు మాత్రమే నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. మిగిలిన దాదాపు నాలుగు వందల యూనివర్సిటీలు కేవలం విజ్ఞానాన్ని ట్రాన్సిమిట్ చేసే ట్రాన్స్‌ఫార్మర్లుగానే మిగులుతున్నాయి. అందులో కూడా ట్రాన్స్‌మిషన్ లాసెస్‌తో నైపుణ్యంలేని విద్యార్థులు బయటకు వస్తున్నారు. మన దేశ జనాభాలో 25 ఏళ్ల లోపు 60 శాతం మంది ఉన్నారు. వీరిలో 15 శాతం మంది మాత్రమే ఉన్నత విద్యలో ప్రవేశిస్తున్నారు. ఈ విషయంలో ఇతర వర్ధమాన దేశాలతో పోలిస్తే మనం చాలా వెనుకబడి ఉన్నాం. ఫిలిప్పీన్స్‌లో 31 శాతం, మలేసియాలో 27 శాతం, థాయ్‌లాండ్‌లో 19 శాతం ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. రాబోయే దశాబ్దంలో 30 శాతం మంది ఉన్నత విద్యలో ప్రవేశించాలని లక్ష్యంగా తీసుకున్నట్లు సిబల్ ఇటీవల పేర్కొన్నారు. ఇందుకు మరిన్ని యూనివర్సిటీల అవసరముంటుంది. విదేశీ విశ్వవిద్యాలయాలు ఈ లక్ష్య సాధనకు కొంత దోహదపడ గలవు.

### నియంత్రణ:

విదేశీ విశ్వవిద్యాలయాలపై మన ప్రభుత్వానికి నియంత్రణ ఉండదని, దీంతో అవి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా తమ కార్యకలాపాలు సాగించే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. ఈ బిల్లులో కొన్ని నియమనిబంధనలున్నా యి. వీటిని ఉల్లంఘించిన విదేశీ విద్యాసంస్థలపై యూజీసీ 1956 చట్టం లేదా

SAKSHI

ఇతర విద్యా చట్టాల ద్వారా చర్యలు తీసుకోవచ్చు. కాబట్టి విదేశీ విద్యాసంస్థలు తమ ఇష్టాను సారంగా వ్యవహరించడం సాధ్యం కాదని కొందరి వాదన. ప్రపంచస్థాయి గుర్తింపు పొందిన 200 యూనివర్సిటీలను ఎంచుకుని వాటిని మాత్రమే అనుమతించాలని గతంలో యశ్‌పాల్ కమిటీ చేసిన సూచనను కచ్చితంగా పాటించాలని కొందరు విద్యావేత్తలు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఈ బిల్లుతో పాటు ఉన్నత విద్య, పరిశోధనల జాతీయ మండలి (ఎన్‌హెచ్‌ఈఆర్) అనే పేరుతో ఒక సంస్థను ఏర్పాటుచేయాలని కూడా భావిస్తోంది. ఇది అమ ల్లోకి వస్తే యూజీసీ, అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీయీ), భారత వైద్య మండలి వంటి సంస్థలు రద్దవుతాయి. యూజీసీ లేదా ఎన్‌హెచ్‌ఈఆర్ నుంచి అనుమతి తీసుకున్న విదేశీ విశ్వవిద్యాలయాలే దేశంలో తమ క్యాంపస్‌లు ఏర్పాటుచేసుకునే అవకాశం ఉంటుంది.

### భిన్నాభిప్రాయాలు:

గాంధేయవాదం విదేశీ వ్యామోహాన్ని తగ్గిస్తే, 1991లో ప్రవేశపెట్టిన నయా ఉదారవాద సంస్కరణలు దాన్ని చట్ట బద్ధం చేశాయని పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇంగ్లిషు విద్య సామర్థ్యంపై అపార విశ్వాసం కలిగిఉండే వారసత్వ అవశేషంగా మాత్రమే సిబల్ ఆలోచనను పరిగణించాలని కొందరు పేర్కొంటున్నారు. ఉన్నత విద్యలో నాణ్యతను పెంచాలనే తొందరలో సృజనాత్మక ప్రాధాన్యతను ఆయన విస్మరిస్తున్నారని వీరు ఆరోపిస్తున్నారు. పరిశోధనల ద్వారా అంటే.. మేధో సంపదలో వైవిధ్యం ద్వారా ఉన్నత విద్యలో నాణ్యత పెరుగుతుంది. భిన్న మార్గాల ద్వారా సంపాదించే విజ్ఞానం పరిశోధనను సుసంపన్నం చేస్తుంది. పాశ్చాత్య విద్యా విధానంలోని అంతర్గత గుణాలను దేశీయ విజ్ఞాన రంగంతో మిళితం చేయలేకపోవడం వల్లే మన విద్యారంగం వెనుకబడిపోయింది. అలా అని విదేశీ విద్యాసంస్థల స్థాపన ద్వారా మెరుగుపరచాలనుకోవడం కన్నుపోయే కాటుకను పెట్టుకోవడమే అవుతుందని వారు హెచ్చరిస్తున్నారు.

శాస్త్ర సాంకేతిక వాణిజ్య రంగాల్లో మనం సాధించిన అభివృద్ధి తక్కువేమీ కాదు, ఇదంతా మన అత్యున్నత విద్యాసంస్థల ద్వారా సాధ్యమైందే తప్ప, విదేశీ విద్యా సంస్థల్లో విద్యనభ్యసించిన వారి వల్ల కాదనే వాస్తవాన్ని ముందుగా గుర్తించాలి. అదే సమయంలో పరిశోధనా ప్రయోగాల విషయంలో భారత్ వెనుకబడడానికి (ప్రపంచంలో మనది 97వ స్థానం) కారణం ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడమే. అంతేకాకుండా విద్యారంగంపై మన ప్రభుత్వం చేస్తున్న వ్యయం చాలా తక్కువ. సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆన్ ఎడ్యుకేషన్ (సీఏబీఈ) కమిటీ సిఫార్సుల ప్రకారం విద్యారంగానికి జీడీపీలో ఆరు శాతాన్ని కేటాయించాలి. అందులో నాలుగోవంతు ఉన్నత విద్యపై ఖర్చు చేయాలి. కానీ ప్రస్తుతం విద్యారంగంపై జీడీపీలో 3.5 శాతం, ఉన్నత విద్యపై 0.4 శాతమే వెచ్చిస్తోంది. 11వ పంచవర్ష ప్రణాళిక ప్రకారం ఐదేళ్ల నిర్దిష్టకాల పరిమితితో నూతన విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలను స్థాపించాలి. ప్రస్తుతమున్న విద్యాసంస్థల ప్రమాణాలను పెంచడానికి కృషి చేయాలి. కాబట్టి ఉన్నత విద్యను ప్రైవేటీ కరించి, చేతులు

SAKSHI

దులుపుకునేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నమే తప్ప వేరొకటి కాదు. జనాభాలో 80 శాతం ఉన్న పీడిత కులాల విద్యార్థులు 14శాతం మంది కూడా ఉన్నత విద్యను అభ్యసించడం లేదు. విదేశీ విద్యాసంస్థల ప్రవేశంతో ఆ సంఖ్య మరింతగా పడిపోయే అవకాశం ఉంది. దేశీయ యూనివర్సిటీలు మరింత నిర్లక్ష్యానికి గురై చివరకు నిర్వీర్యమయ్యే ప్రమాదం పొంచి ఉంది. గుర్తింపు పొందిన విదేశీ సంస్థలపై భారత ప్రభుత్వానికి, యూజీసీకి ఎటువంటి నియంత్రణాధికారాలు ఉండబోవు. కాబట్టి వాటి నాణ్యతా ప్రమాణాలు, ఫీజులను పర్యవేక్షించే అవకాశం మన చేతుల్లో ఉండదు. ఫలితంగా విద్యార్థులను ఇవి నిలువుదోపిడీ చేస్తాయి. వాస్తవానికి ప్రముఖ యూనివర్సిటీలేవీ దేశంలో తమ క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా లేవని పలు సందర్భాల్లో ఆ సంస్థల ప్రతినిధులే వెల్లడించారు. హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలు, ఎమ్ఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ లాంటి విద్యాసంస్థలేవీ ఇక్కడ విద్యాబోధనకు ముందుకురావడం లేదు. కేవలం వ్యాపారం లక్ష్యం ఉన్న సంస్థలే ఆసక్తి చూపు తున్నాయి. కాబట్టి మన దేశంలో లభించని శాస్త్ర, సాంకేతిక విద్య కోసం విదేశాలకు వెళ్లడాన్ని నిలువరించలేం.

**'విదేశీ' అనుభవం:**

- విదేశీ విద్యాసంస్థల ద్వారా లభించే నాణ్యత ఏమిటన్న విషయంలో మన పొరుగుదేశాల అనుభవాన్ని పరిగణనలో తీసుకోవాలి.
- పదిహేనేళ్ల కాలంలో సింగపూర్, చైనా, గల్ఫ్‌దేశాలు పొందిన అనుభవం ఏ మాత్రం సంతృప్తికరంగా లేదు.
- ధనరూపంలో సబ్సిడీలు, మూడోవంతు ధరకే భూముల కేటాయింపు, తేలికపాటి రుణాలు ఇచ్చినప్పటికీ చికాగో బూత్‌స్కూల్, జాన్ హాప్కిన్స్, వార్విక్ యూనివర్సిటీ వంటి వర్సిటీలు సింగపూర్ నుంచి తిరుగుప్రయాణం కట్టాయి.
- కఠిన నిబంధనలతో విదేశీవిద్యా సంస్థలను చైనా అనుమతించినప్పటికీ, అవి పెద్దగా ఉపయోగంలేని కోర్సులను ప్రవేశపెట్టాయి. దీంతో దేశీయంగా విమర్శలు వెల్లువెత్తాయి.
- ఇజ్రాయిల్ తొలుత విదేశీ సంస్థలను ఉత్సాహంగా ఆహ్వానించినప్పటికీ నాణ్యత లేకపోవడంతో కొద్దికాలానికే వాటిని బయటికి సాగనంపింది.
- విదేశీ విద్యాసంస్థల రాకతో దేశీయ సంస్థల్లో పనిచేస్తున్న అనుభవజ్ఞులైన అధ్యాపకులు వాటి వైపునకు మళ్లుతారు. దీంతో దేశీయ సంస్థలు దెబ్బతినే ప్రమాదం ఉంది. కాబట్టి ఈ బిల్లు వెనుక పొంచిన ప్రమాదాలను గుర్తించాలని విదేశీ విద్యాసంస్థల ప్రవేశాన్ని వ్యతిరేకించేవారు హెచ్చరిస్తున్నారు.

SAKSHI